క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వి.వాణీ విజయరత్నం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలకోడేరు మండలం కుముదవల్లి-3 (ఓసీ), ఉండి మండలం వేంపాడు-1 (బీసీ-బీ) కార్యకర్త పోస్టులు, ఆకివీడు మండలం దుంపగడప శివారు పల్లెపాలెం (బీసీ-ఏ), పెన్నాడ-3 (బీసీ-డీ), దుంపగడప-6 (ఓసీ), కాళ్ల-3 (ఎస్‌సీ), పెన్నాడ పాలెం(ఓసీ)లో సహాయకురాలు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్థానికులైన వివాహిత మహిళలు అర్హులని, 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. తక్కువ స్థాయి అంగవైకల్యం గల వారు అర్హులని తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

పాలకోడేరు: పెనుమంట్ర హెడ్ కానిస్టేబుల్ పాలా వరప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో జిల్లాలోని సహచర సిబ్బంది వరప్రసాద్ కుటుంబానికి రూ.2.16 లక్షలు వసూలు చేసి జిల్లా ఎస్పీకి అందించారు. ఎస్పీ రవిప్రకాష్ సోమవారం వరప్రసాద్ స్వగ్రామమైన వేంద్ర వెళ్లి వరప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వరప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ పోలీస్ నాయకుడు సీహెచ్ మోజేస్, ఏఎస్సై దాలియ్య, పాలకోడేరు ఎస్సై శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్స్ రాము, అలెగ్జాండర్లు పాల్గొన్నారు.

ధర్మపథంలో నడిస్తే ప్రశాంతత



కాళ్ల: ధర్మ పథంలో నడిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆధ్యాత్మిక గురువు రాధాకృష్ణ గట్టు (హైదరాబాద్) పేర్కొన్నారు. కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు మంతెన రామ్ కుమారరాజు స్వగృహంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాల్లో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. గౌతమ బుద్ధుని అభిధర్మాలను అనుర్ధాచార్యులు పాలీ భాషలో రచించగా చాలా మంది అనేక భాషల్లో తర్జుమా చేశారని వివరించారు. వాటి ఆధారంగా తాను అభిధర్మ అర్థ సంగ్రహము అనే పుస్తకాలను రెండు భాగాలుగా రూపొందించినట్టు చెప్పారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు ముగింపు సందర్భంగా పలు ప్రవచనాలు చేశారు. నిత్య జీవనంలో ధ్యానాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చిన సాధకులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి అప్రోచ్ రోడ్డు నిర్మాణం

పెనుగొండ: మండలంలోని దొంగగూడెంలో ఉన్న జగనన్న కాలనీ ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక సుమారు 200 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, గృహనిర్మాణానికి రుణం మంజూరు చేశారు. ఇప్పటికే కాలనీలో సగంకు పైగా గృహనిర్మాణాలు తుది దశకు చేరుకొన్నాయి. దీంతో కాలనీలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయ కల్పన పూర్తి చేశారు. ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడ్డ కాలనీ వాసులకు రహదారి నిర్మాణంతో ఇబ్బందులు తొలగనున్నాయి. ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వంలో కాలనీ వాసులు ప్రధాన రహదారి విషయాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు రహదారి నిర్మాణం సత్వరం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. త్వరలోనే అంతర్గత రహదారుల నిర్మాణం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఇబ్బందులు తొలగించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు అండగా సీఎం జగన్

ఎంపీపీ శ్రీహరినారాయణరాజు



ఇంక్రిమెంట్ మంజూరు పత్రాలు అందుకున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: ప్రజాసంక్షేమంలో ఉద్యోగులు కీలకపాత్రమని, వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సోమవారం యండగండి పీహెచ్‌సీలో ఆసుపత్రి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఏఎన్ఎం (హెల్త్ అసిస్టెంట్)లకు అందించిన ఇంక్రిమెంట్ మంజూరు పత్రాలను ఎంపీపీ వారికి అందజేశారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో యండగండి కోఆపరేటివ్ బ్యాంక్ తరపున అందజేసిన రూ.50 వేల విలువైన ఇన్వర్టర్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి, అనంతరం వాటిని శాస్వత ఉద్యోగులుగా మార్చారని గుర్తుచేశారు. హెల్త్ అసిస్టెంట్లను కూడా గతేడాది జూలైలో పర్మినెంట్ చేశారని, నేడు ఏడాది కాలానికి మొదటి ఇంక్రిమెంట్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. పీహెచ్‌సీలో ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, నైట్‌వాచ్‌మెన్, ఎఫ్ఎన్ఓ పోస్టుల భర్తీకి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ డి.బెన్ని సామ్యూల్, ఎంపీహెచ్ఓ బిజయ్‌కుమార్, శివాజీగణేష్, రత్నరాజు పాల్గొన్నారు.

ఈ-ఫిష్ నమోదు కోరుతూ ఫిర్యాదు



స్పందనలో ఫిర్యాదు చేస్తున్న దొడ్డనపూడి ఆక్వా రైతులు

కాళ్ల: ఈ ఫిష్‌లో నమోదు చేయమంటూ దొడ్డనపూడి గ్రామానికి చెందిన పలువురు ఆక్వా రైతులు సోమవారం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. లైసెన్సులన్నీ ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వల్లే ఈ ఫిష్ నమోదు కాలేదని, సబ్సిడీ తొలగించడంతో రైతులకు అధిక విద్యుత్ బిల్లులు వచ్చాయని పేర్కొన్నారు. కాళ్ల గ్రామంలో ఇళ్ల పైనుంచి హై టెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు వద్దని ఒకటి, వెబ్ ల్యాండ్‌లో పేరు మార్పు కోరుతూ ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ టీపీ కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వాతి, ఎఫ్డిఓ ప్రియదర్శిని, పంచాయతీరాజ్ ఏఈ రమేష్ బాబు తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో ఏడు అర్జీలు

ఆకివీడు: సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఏడు అర్జీలు వచ్చినట్టు ఎంపీడీఓ కందుల వాణి తెలిపారు. సదరన్ సర్టిఫికెట్ ఇప్పించి, పింఛన్ మంజూరు చేయించాలని స్థానిక పెదపల్లి వీధికి చెందిన షేక్ రఫీ, ఇళ్ల పట్టాలో ఆధార్ నమోదు సక్రమంగా జరగలేదని రాజులపేటకు చెందిన లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఓల్డ్‌వయ్యేరు పంట కాలువ గట్లపై కొబ్బరి మొక్కల వల్ల కాలువలో చెత్త తొలగింపు ఇబ్బందికరంగా ఉందని సిద్ధాపురం గ్రామస్తుడు జంపన రామరాజు, నగర పంచాయతీలో అక్రమంగా శాండ్ తొలగింపు, తాళ్లకోడులోని జగనన్న కాలనీలో 144వ ప్లాట్‌కు చేర్చి ఉన్న రహదారిని, పంట కాలువ గట్టును అక్రమంగా తొలగించారని, తాను భవనం నిర్మించుకునే అవకాశం లేకుండా చేశారని లబ్ధిదారు సాకా ప్రసన్నలత ఫిర్యాదు చేశారన్నారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పరిష్కార నిమిత్తం బట్వాడా చేశామని ఎంపీడీఓ వాణి తెలిపారు.

డ్రెయినేజీ పూడికపై ఫిర్యాదు

ఉండి: మండలంలోని చినపుల్లేరు గ్రామ ఎస్సీ ఏరియాలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, డ్రెయినేజీలో పూడిక తీయించాలంటూ స్థానికులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో పంచాయితీ కార్యదర్శి, పాలకవర్గానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు.

వలంటీర్లకు రుణపడి ఉంటాం

భీమవరం అర్బన్: టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. పింఛన్ డబ్బులు అందే వరకు రోజూ లైనులో నిలబడి కాళ్ల నొప్పులు వచ్చి అనారోగ్యానికి గురయ్యేవాళ్లం. వలంటీర్ల వ్యవస్థ వచ్చాక నెలలో ఒకటో తేదీన సూర్యుడు రాకముందే పింఛన్ డబ్బులు చేతికందుతున్నాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏ అవసరమున్నా వలంటీర్లకు చెబితే వారే చేస్తున్నారు. వాళ్లకు రుణపడి ఉంటాం.

– రేవు సుందరయ్య, పింఛన్ దారుడు, దొంగపిండి

వరదల్లో మమ్మల్ని రక్షించారు



కోరాడ అప్పల నరసమ్మ

భీమవరం (ప్రకాశం చౌక్): నేను భీమవరం 39వ వార్డులో నివాసం ఉంటున్నాను. గతాడాది ఇదే రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు వరదలు ముంచెత్తాయి. ఆ సమయంలో నన్ను వలంటీర్లు వచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాకు భోజనం కూడా అందించారు. ఆరోజు వలంటరీ వల్లే వరదల నుంచి బయటపడ్డాను. ఆరోజు వారందించిన సేవలు ఇప్పటికీ మర్చిపోలేను.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు తథ్యం



భీమవరం మండలంలోని యనమదుర్రులో కాలిబాటలు వేసిన వరి చేను

భీమవరం అర్బన్: సార్వా సాగులో విత్తన ఎంపిక, వరి నారు, నాట్లు వేసే సమయంలో సరైన మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు చెబుతున్నారు. 'ముందస్తు సార్వా సాగు చేపడితే అక్టోబర్, నవంబర్‌లలో భారీ వర్షాలు, తుఫాన్‌లు దాటినుంచి పంటను రక్షించుకోవచ్చు. భీమవరం మండలం దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, తాడేరు, తుందుర్రు, కొమరాడ, చినఅమిరం, రాయలం, అనాకోడేరు తదితర గ్రామాల్లో సుమారు 8,500 ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం యనమదుర్రు, గునుపూడి గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. ఆఖరి దమ్ములో సూపర్ పాస్ఫేట్, యూరియా, పొటాషియం చల్లుకోవాలి. 15 రోజులకు 3జీ లేదా 10, గుళికలు 4జీ ఎకరానికి 8 కేజీలు వేసుకోవాలి. గుళికలు వల్ల మొవ్వు పురుగులు ధరిచేరవు. 20 నుంచి 30 రోజులైన వరి నారు నాటుకోవాలి. నారు చివరన తుంచి నాటితే తెగులు వ్యాప్తి తగ్గుతుంది. కాండం దొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. చదరపు మీటర్‌కి 33 కుదుర్లు ఉండేటట్లుచూసుకోవాలి. వరి నాట్లు వేసేటప్పుడు చేలో నీరు రెండు సెంటీ మీటర్ల లోఉత ఉండేటట్లు. వరినాట్లు వేసిన తరువాత కాలిబాటలు వేసుకోవాలన్నారు. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్లు కాలిబాట వేసుకుంటే వరి దుబ్బులకు గాలి చొరిగడమే కాకుండా సూర్యరశ్మి పడి చీడ పీడలు ధరి చేరవు. విచక్షణా రహితంగా ఎరువులు, పురుగులు వాడటం వల్ల ఖర్చులు పెరిగి సాగులో నికరాదాయం తగ్గిపోతుంద'ని వివరించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి



చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నరసాపురం రూరల్: ఆషాఢ అమావాస్య నుపురస్కరించుకుని నరసాపురం పట్టణంలో శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక 12వ వార్డులోని పడుగుల తోటలో నిర్వహించిన ఈ వేడుకల్లో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ సభ్యుడు మావూరి సత్యనారాయణ, కౌన్సిలర్ ద్వార గంగాభవానిప్రకాష్‌లు మాట్లాడుతూ ప్రతీ ఏటా ఆషాఢ అమావాస్య రోజున శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతిని దేవాంగ కులస్తులు ఎంతో భక్తిబావంతో జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా వీవర్స్ కాలనీ, పడుగులతోట ప్రాంతాకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి చీర, సారె సమర్పించి కుంకుమపూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి ఆనెం ఆనందకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కనకం వరప్రసాద్, కోశాధికారి బళ్ల రమేష్‌కుమార్, బూడిద జోగేశ్వరరావు, ద్వార సారధి, బళ్ల జగదీష్, వీర్న పద్మ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటపై కేసులు

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో కొట్లాడుకున్న ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై కె.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోళ్ల లక్ష్మణరావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కుడిపూడి దుర్గాప్రసాద్ చెడుగా ప్రచారం చేస్తుండటంతో ఈనెల 16న ఇరువురు గొడవపడ్డారు. దుర్గాప్రసాద్ లక్ష్మణరావును కర్రతో కొట్టడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. అయితే అదే గ్రామానికి చెందిన కుడుపూడి వీరవెంకట్రావు అనే వ్యక్తి తాను ఈ నెల 16న బైక్‌పై వెళుతుండగా పాతకక్షల నేపథ్యంలో కోళ్ల లక్ష్మణ్‌రావు అనే వ్యక్తి తనను కిందికి లాగి కొట్టి గాయపరచాడని భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఇరువురికీ సంబంధించి ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసులు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీపై కేసు

సాక్షి, భీమవరం: స్థానిక రెండో పట్టణ పరిధిలోని రాయలానికి చెందిన కె.విజయత్ తేజ్ తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి తన ఇంటి ముందు నిలుపుదల చేసి సోమవారం ఉదయం చూసే సరికి లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

● వన్‌టౌన్ పరిధిలోని మెంటేవారితోటలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

● భీమవరం టూటౌన్ పరిధిలోని ఒక ఫైనాన్స్ ఆఫీసులో దొంగతనం చేసిన వి.శ్యాం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి ఉపాధి కోసం వచ్చిన అతడు ఇక్కడ దొంగతానికి పాల్పడినట్టు చెప్పారు. సీఐ బి.కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అరెస్ట్

వీరవాసరం: కొట్లాట కేసులో కేసు నమోదు చేశామని ఎస్సై పి.రమేష్ సోమవారం తెలిపారు. దూసనపూడి గ్రామానికి చెందిన సాంబశివరావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ, మణికంఠం దాడికి పాల్పడ్డారు. గాయపడిన సాంబశివరావును ఆసుపత్రికి తరలించారని, కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

శాకంబరిగా ఆదిలక్ష్మి దర్శనం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆషాఢమాసం అమావాస్య సందర్భంగా గునుపూడిలోని శ్రీఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మవార్లు భక్తులకు శాకంబరిగా దర్శనమించ్చారు. ఆలయ ఈఓ గొట్టుముక్కల సీతారామరాజు పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు ఆకుకూరలతో అమ్మవార్ని శాకంబరి దేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా ఆదిలక్ష్మి అమ్మవారు →



మాదివాడ అమ్మవార్లకు సారె



మాదివాడలో అమ్మవార్లకు సారె తీసుకెళుతున్న మహిళలు

ఆకివీడు: ఆషాఢ మాసం ఆఖరి రోజు సోమవారం స్థానిక మాదివాడలోని ఏడు ఆలయాల్లోని అమ్మవార్లకు మహిళలు సారె సమర్పించారు. గంగానమ్మ, మద్దిరావమ్మ, అమ్మవార్లకు, వేంకటేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, రామాలయం, మూడు ప్రాంతాల్లోని పుంతలో ముసలమ్మవార్ల ఆలయాల్లో సారెలు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, దేవస్థానం చైర్మన్ గునుకుల కొండయ్య, శివ కేశవ భజన మండలి మహిళా సభ్యులు, స్థానికులు, గ్రామ పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

'అమాయకులెవ్వరికీ అన్యాయం జరగకూడదు'



భీమవరం కోర్టు ఆవరణలో న్యాయ దేవత విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అమాయకులెవ్వరికీ అన్యాయం జరగకూడదన్న సూత్రం న్యాయవ్యవస్థకు పునాది వంటిదని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, పాకా రమేష్ అన్నారు. సోమవారం స్థానిక కోర్ట్ అవరణలోని న్యాయ దేవత విగ్రహం వద్ద అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని బార్ అసోసియేషన్, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో నిర్వహించారు. అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఏర్పాటుకు గుర్తింపు చర్యగా ఏటా అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంవీ రమణ, పాకా రమేష్‌లు తెలిపారు. న్యాయాన్ని కాపాడితే. న్యాయమే మనల్ని కాపాడుతుందని చెరుకువాడ రంగసాయి ప్రతిజ్ఞ చేశారు. న్యాయదేవత విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, న్యాయవాదులు అడబాల శ్రీనివాస్, మోకా రాముడు, ఎం కాస్త్రో, వాసు గోపాలరావు, చెల్ల రాము, ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేమ్స్

సాక్షి, భీమవరం: పెన్షనర్లకు పీఆర్సీ, కరువుభత్యం అరియర్స్ వెంటనే చెల్లించాలని జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ జమ చేయాలని, పే రెవిజన్ కరువు భత్యం బకాయిలు ఒకేసారి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, 11వ పీఆర్సీలో కుదించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇంతకుముందు మాదిరిగానే చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రిల్లో ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా వైద్యం అందేలా చూడాలన్నారు. సంఘం కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్ నివేదికలు సమర్పించారు. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రతాప్ రాజు, గోపాలకృష్ణమూర్తి, వీఎస్ అప్పారావు, ఈఏ నర్సింహారావు, టీఎస్ రెడ్డి, పీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుల రాజకీయాలతో లబ్ధి పొందిన పితాని



ఆచంటలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

పెనుగొండ: కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయంగా లబ్ధి పొంది, కులపరంగా వెలివేతలను ప్రోత్సహించిన ఘనత మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు దక్కుతుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ విమర్శించారు. సోమవారం ఆచంట ఏఎంసీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సంఘాల నాయకులు మాజీ మంత్రి పితాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నడిపూడి శివారు మిద్దేవారి పాలెంలో ఎస్సీ కులానికి చెందిన 12 కుటుంబాలను స్థానిక బీసీ సంఘం వెలివేశారని ఆరోపించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారన్నారు. అయితే, మార్టేరు జరిగిన టీడీపీ సభలో మాజీ మంత్రి పితాని, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీరంగనాథరాజు పాలనలో ఆచంటలో ఎక్కడా కులాల గొడవలే లేవన్నారు. కులాలు, మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ఏకైక నేత మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ పేలితే ఊరుకోమని హెచ్చరించారు. ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య మాట్లాడుతూ వెలికు గురైన కుటుంబాలు ఫిర్యాదు చేయకుండా మగ్గిపోవాలా? పితానిగారూ అంటూ ప్రశ్నించారు. కులాల మధ్య గొడవలు పెట్టి రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. బాధితులను కించపరచడం దారుణమన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ ఈది అనిత, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరావు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, ఉల్లం జ్యోతి, తప్పెట్ల వెంకట్రావు, ఏఎంసీ డైరెక్టరు కొండేటి భవానీ ప్రసాద్, రావి నాగరాజు, మానుకొండ సత్యనారాయణ, మండల కన్వీనర్లు పలివెల శ్రీను, బుర్రా రవికుమార్, ఇంజేటి సుగుణ రాజు, పార్టీ నాయకులు గంటి బాబూరావు, ఏనుగుపల్లి వరప్రసాద్, సిర్రా పాపారావు, సిర్రా శ్రీరామ్, గొల్లపల్లి బాలకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం

పోడూరు: మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు చొరవతో కవిటం శివారు నల్లవెంకయ్య చెరువు ఎస్సీకాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారమైంది. మురుగునీటి సమస్యపై కాలనీవాసులు ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజుకు పిర్యాధు చేయడంతో సోమవారం ఆయన గ్రామానికి వచ్చి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 1978లో తమ కాలనీ ఏర్పడిందనీ, దాదాపు 500 కుటుంబాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు చెప్పారు. పూర్వం నుంచి తమకాలనీ ఇళ్లలోని మురుగునీరు సమీపంలోని పంట బోదెలోకి వెళ్లేదనీ, ఇటీవల మురుగునీరు వెళ్లకుండా రైతులు అడ్డుకోవడంతో ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లకుండా నివాస ప్రాంగణాల్లో ఉండిపోయి రోడ్లపైకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు కాలనీలో వీధుల్లో తిరిగి సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి కాలనీకి 300 మీటర్ల దూరంలో పోడూరు పుంతలోని మురుగుబోదెలోకి ఇళ్లలోని వాడకం నీరు వెళ్లేలా కచ్చా డ్రెయిన్ తవ్వించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుక్కల సూర్యనారాయణ, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఆర్ఐ కె.రాంబాబు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు సత్తి మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్‌లు చేకూరి సూరిబాబు, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

విశ్వమానవ వేదిక సేవలు అభినందనీయం

పోడూరు: నిరాదరణకు గురైన వృద్ధులు, వికలాంగులు, యాచకులకు నిత్యం భోజన సదుపాయం అందిస్తున్న విశ్వమానవవేదిక సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్.సత్యనారాయణమూర్తి(బాబ్జి) అన్నారు. నిత్యాన్నదానం ప్రారంభించి 2800 రోజులు పూర్తయిన సందర్భంగా వేడంగి లో విశ్వమానవ వేదిక ద్వారా భోజన క్యారియర్‌ల పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే విశ్వమానవవేదిక వృద్ధాశ్రమం వద్ద ఏర్పాటుచేసిన అన్నసమారాధనను ప్రారంభించి భోజనాలు వడ్డించారు. విశ్వమానవ వేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్, మాజీ సర్పంచ్ యర్రంశెట్టి పద్మారావు, ఎంపీటీసీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.